క్లుప్తంగా

కనీస వేతనం అమలు చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని దినసరి వేతన, క్యాజువల్, లంప్సమ్ ఉద్యోగులకు కనీసం వేతనం చట్టం అమలు చేయాలని తెలంగాణ యూనివర్సిటీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో దినసరి వేతన, లంప్సమ్ క్యాజువల్ ఉద్యోగులుగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు అమలు చేయటం లేదని విమర్శించారు. కనీస వేతనాల చట్టం 60 జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, కేయూ సీఐటీయూ కమిటీ అధ్యక్షుడు రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు సంఘాల రాజు, మేకల శ్రీనివాస్, పల్లం రాజు, మధు, సహాయ కార్యదర్శి గాజ రాజు, కోశాధికారి రాజేందర్, బాధ్యులు ఎండి.నయీమ్, డి.కృష్ణ, పి.శోభ, ఆర్.ప్రభాకర్, సిహెచ్.రమేష్, ఎం.వినోద్, డి.రాణి, నర్మదాలక్ష్మి పాల్గొన్నారు.

వాహన డ్రైవర్ నిరసన

వరంగల్ అర్బన్: బల్దియా శానిటరీ సూపర్‌వైజర్ తనను కొట్టడని ఔట్ సోర్సింగ్ వాహన డ్రైవర్.. బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపాడు. మంత్రి కేటీఆర్ భూపాలపల్లి పర్యటన సందర్భంగా బల్దియాకు చెందిన షీ టాయిలెట్ వాహనాన్ని తీసుకెళ్లాలని టిప్పర్ నడిపే ఔట్ సోర్సింగ్ డ్రైవర్ ప్రవీణ్‌ను శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య ఆదేశించారు. డీజిల్ విషయంలో డ్రైవర్‌కు, శానిటరీ సూపర్‌వైజర్‌కు మధ్య వివాదం జరిగింది. దాంతో తనపై సూపర్‌వైజర్ సాంబయ్య చేయి చేసుకున్నాడని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. అతనిపై చర్య తీసుకోవాలని బల్దియా సీఎంహెచ్ఓ రాజేష్‌కు ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు.

'నట్టల మందు' వేయించాలి

హసన్‌పర్తి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించాలని ఎంపీటీసీ సభ్యురాలు బండారి రజిత సూచించారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో గురువారం నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యకమంలో పశువైద్యాధికారి క్రాంతి, టీఎల్‌ఓ బింగి సురేష్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికులు.. ఆరోగ్యం జాగ్రత్త

ఖిలా వరంగల్: దుమ్మూధూళితో నిత్యం సహవాసం చేసే భవన నిర్మాణ కార్మికులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ ఏఎల్ఓ వినోద్, సీఎస్‌సీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కమలాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ కోరారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటలోని ఆర్‌ఆర్‌గార్డెన్‌లో ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మి సంఘం ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ సెంటర్ నేతృత్వంలో 23నుంచి 25వరకు కొనసాగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని వారు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు 36 రంగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడు లేబర్, ఆధార్ కార్డులు తీసుకుని వచ్చి 60రకాల పరీక్షలు ఉచితంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉప్పల రవి, కుమారస్వామి, రావుల రాజేష్, రాధమ్మ, రమాదేవి, రాజు, సరిత, శ్రీనివాస్, రాజేశ్వరి పాల్గొన్నారు.

రఘుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుడు కొగిలా రఘుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎమోషన్స్ రికగ్నిషన్ ఇన్ స్పీచ్ యూసింగ్ వేరియాస్ అప్రోచెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రఘుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ ఎం.సదానందం పర్యవేక్షణలో రఘు తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

ఎంజీఎం: ఆర్‌బీఎస్‌కేలో పనిచేసే ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రావు, రవీందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ స్పందించి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.

అయోధ్య మట్టి.. కాశీ జలం

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలో సీతారామ హనుమాన్ సమేత రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. స్థానికంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణం కోసం అయోధ్య నుంచి తీసుకొచ్చిన మట్టి, కాశీ నుంచి తెచ్చిన గంగ జలాన్ని పూజారుల సమక్షంలో రామాలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజు గురువారం బాలభోగం, యాగశాలలో చతుస్థానార్చన, ఉత్సవమూర్తులకు ఫల, పుష్ప ఆదివాసం, నిత్య పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామసేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పొంచి ఉన్న ప్రమాదం

- నిత్యం గ్రానైట్ లారీల రాకపోకలు
- కట్టపై ఏర్పడిన గుంతలు
- దుమ్మూధూళితో పంటపొలాలకు ముప్పు
- పట్టించుకోని అధికారులు



కట్టపై నుంచి గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ



దెబ్బతింటున్న కట్ట

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ కట్టపై గ్రానైట్ లారీల రాకపోకలు ఎక్కువయ్యాయి. దాంతో కట్టకు ప్రమాదం పొంచి ఉంది. అన్నాసాగరం సమీపంలోని ఓ క్వారీ నుంచి గ్రానైట్ లోడ్‌తో వెళ్లే లారీల రాకపోకలతో కట్టపై గుంతలు ఏర్పడ్డాయి. కాల్వను ఆనుకుని ఓ క్వారీ ఉంది. ఈ క్వారీకి రోడ్డు మార్గం లేదు. దాంతో కట్టే వారికి ప్రధాన దారి. దాంతో పదేళ్లుగా కట్టపై నుంచి గ్రానైట్ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి.

కట్టపై ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిషేధం

ఎస్సారెస్పీ కాల్వ కట్టపై ప్రైవేట్ వాహనాలు (భారీ వాహనాలు, ట్రాక్టర్లు, లారీలు) వెళ్లడం నిషేధం. అయితే, అధికారులు, ప్రజాప్రతినిధుల కళ్ల ముందే ప్రైవేట్ వాహనాలు కట్టపై నుంచి యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఏదైనా ప్రైవేట్ వాహనాలు కట్టపై కనిపిస్తే వెంటనే సీజ్‌చేసి కేసు నమోదు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఉన్నాయి. రైతులు మాత్రమే కట్టను వినియోగించాలని మార్గదర్శకాలు ఉన్నాయి.

కట్టకు పొంచి ఉన్న ముప్పు

గ్రానైట్ లారీల వల్ల కట్ట దెబ్బతింటోంది. పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని సందర్భాల్లో లారీలు అదుపు తప్పి ఎస్సారెస్పీ బ్రిడ్జిని ఢీకొన్న ఘటనలు కూడా ఉన్నాయి. కాగా, లారీలు వెదజల్లుతున్న దుమ్మూ ధూళితో పంటలు పాడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రానైట్ లారీలను స్థానిక రైతులు అడ్డగించారు. ఈవిషయమై నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా వారు స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లకే పాడైంది

ఐదేళ్ల క్రితం ఎస్సారెస్పీ కట్టకు మరమ్మతులు చేపట్టారు. కాల్వకు ఇరువైపులా కట్టను అభివృద్ధి చేశారు. అయితే వాహనాల తాకిడి వల్ల అనతికాలంలో కట్ట దెబ్బతింటోంది. కట్టను పర్యవేక్షించాల్సిన అధికారులు మొద్దునిద్రలో ఉండడమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఈ విషయమై నీటి పారుదల శాఖ అధికారులను వివరణ కోరగా, అది తమ డివిజన్ కాదంటే తమది కాదని సమాధానం చెప్పడం గమనార్హం.

పంట పొలాలు పాడవుతున్నాయి



గ్రానైట్ లారీల రాకపోకల కారణంగా దుమ్మూధూళితో పంట పొలాలు పాడవుతున్నాయి. ఎస్సారెస్పీ కట్ట కుడా దెబ్బతింటోంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్, ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– మొట్టె కుమారస్వామి, రైతు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

ఖిలా వరంగల్: అక్రమ మార్గంలో తరలించే ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని వరంగల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాకతీయ సాండ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సభ్యుడు సిరబోయిన కరుణాకర్‌తో కలిసి భూపాల్ మాట్లాడారు. ఇసుక తరలింపునకు అనుమతిచ్చే అధికారులే ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అనంతరం, అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా రద్దు చేసి అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోరాటాలే పరిష్కార మార్గాలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వరంగల్ చౌరస్తా: సమాజంలో పెరిగిపోతున్న ప్రజా సమస్యలకు పోరాటాలే మార్గం చూపిస్తాయని, అందుకు ఎర్రజెండానే ప్రత్యామ్నాయం అని, ఆ దిశగా పార్టీ నిర్మాణం చేపట్టాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లోని పార్టీ కార్యాలయంలో సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నాయకులు కొమురయ్య, రాగసుధ, నాయకులు మల్లికార్జున్, ఎండి.స్మైల్, కుమారస్వామి, అరుణ్‌నాయక్, రాజమౌళి, కేశెట్టి సదానందం, మాలి ప్రభాకర్ పాల్గొన్నారు.

బీసీల సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌గౌడ్

హన్మకొండ: బీసీల ఆత్మీయ, అభినందన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన బైరి రవికృష్ణగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుల్కచర్ల శ్రీనివాస్ ముదురాజ్ నియమితులయ్యారని వివరించారు. ఈనెల 26న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరగనున్న బీసీల ఆత్మీయ, అభినందన సభలో వారిని ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

నగరంలో నేడు.. రేపు

నేడు మెట్టు రామలింగేశ్వరస్వామి రథోత్సవం

మడికొండ: మెట్టు రామలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ దువ్వ నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముగింపు సందర్భంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బండి సంజయ్ రాక

హన్మకొండ: ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా 54వ డివిజన్ పరిధిలో శుక్రవారం జరగనున్న శక్తి కార్నర్ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. కేయూ క్రాస్ రోడ్డులోని కందకట్ల గేట్ వే కాంప్లెక్స్ వద్ద సాయంత్రం జరగనున్న కార్యక్రమంలో సంజయ్ పాల్గొంటారని చెప్పారు.

25, 27 తేదీల్లో వ్యాసరచన పోటీలు

కేయూ క్యాంపస్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 25, 27వ తేదీల్లో వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య తెలిపారు.

యూనిట్ల పనితీరు నమోదు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

వరంగల్ రూరల్: జిల్లాలో దళితబంధు యూనిట్ల పనితీరును క్షేత్రస్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎంపీడీఓలు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్లకు దళితబంధు యాప్‌లో యూనిట్ల వివరాల సేకరణపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డీడీ సురేశ్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతగా 303 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలను గతంలో ఆఫ్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. కొత్తగా వచ్చిన దళితబంధు యాప్‌లో యూనిట్ల వివరాలను చేయాలని, బాగా పని చేస్తున్న, అంతగా నడవని యూనిట్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేయాలని సూచించారు.

బల్దియా నిర్లక్ష్యంతోనే కుక్క కాట్లు

వరంగల్ చౌరస్తా: వరంగల్ బల్దియా నిర్లక్ష్యంతోనే నగరంలో కుక్కల బెడద అధికమైందని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ విమర్శించారు. వరంగల్ దయానంద కాలనీలోని మీసాల ప్రకాశ్ తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో కుక్కలు, కోతుల బెడద అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని నగరవ్యాప్తంగా కుక్కలు, కోతులను పట్టుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు కూచన రవీందర్, సందెల లాజర్ జంగం, ప్రభాకర్, నర్మెట్ట చిన్న, పోలెపాక విశాల్, బాబు, కట్కూరి అన్వేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, దేవసాని కీర్తి, జహీర, ఇనుముల విజయ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలేవి?

హన్మకొండ: వరంగల్ మహానగరంలో కుక్కలు, కోతుల బెడద నివారణకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన చర్యలను ప్రజల ముందుంచాలని ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలో గురువారం జరిగిన ప్రజా వేదిక జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన నేపథ్యంలో వరంగల్ మహానగరంలో కుక్కలు, కోతుల సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించి ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించాల్సిన అవసరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఉందని ఆయన గుర్తుచేశారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌కు అభినందనలు



సన్మానిస్తున్న పింగిళి కాలేజ్ ప్రిన్సిపాల్, తదితరులు

విద్యారణ్యపురి / హన్మకొండ అర్బన్: నగరంలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల.. నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) ఏ ప్లస్ గ్రేడ్ సాధించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, న్యాక్ కో ఆర్డినేటర్ రమేష్, కళాశాల అధ్యాపక బృందం సభ్యులను పింగిళి కళాశాల ప్రినిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి, అధ్యాపకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో పింగిళి కళాశాల న్యాక్ కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, మైక్రో బయోలజీ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ రేణుక, మాధవి, సురేష్, అధ్యాపకుడు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి బస్తాల లెక్క ఓకే..



మార్కెట్ ఉద్యోగులతో మాట్లాడుతున్న రాహుల్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేందుకు తెచ్చి మిర్చి యార్డుల్లో పెట్టి ధరలు నచ్చకపోవడంతో పాటు ఇతరత్ర కారణాలతో కోల్డ్ స్టోరేజీలకు వెళ్లిన బస్తాల లెక్కలు సరిగానే ఉన్నాయని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్ అన్నారు. మిర్చి యార్డు నుంచి కోల్డ్‌స్టోరేజీలకు గురువారం వెళ్లిన బస్తాల నిర్ధారణ కోసం మార్కెట్ అధికారులు 8 బృందాలుగా ఏర్పడి స్టోరేజీల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరైన రికార్డులు లేని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో గ్రేడ్ కార్యదర్శులు, ఏఎస్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


గణితంలో రాణించడం సులభం



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

కాశిబుగ్గ: గణితం అంటే చాలా మంది విద్యార్థులు భయపడతారని, ఇష్టాన్ని పెంచుకుంటే ఎంతో సులభతరంగా రాణించవచ్చని వరంగల్ సైన్స్ సెంటర్ అధికారి వి.వెంకటేశ్వరరావు సూచించారు. నేషనల్ మేథమెటిక్ ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక మండలి (టీఎస్ కాస్ట్)ఆధ్వర్యంలో శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో గణితం, రంగోళి, వకృత్వ, వ్యాస రచన పోటీలను గురువారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీధర్, సైన్స్ సెంటర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, రిసోర్స్ పర్సన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు ఉపేందర్, లావణ్య పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి 'ఏకశిల' చేయూత



సరుకులు అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

ఖిలా వరంగల్: అనాథ పిల్లలు, వృద్ధులకు శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్, ఏకశిల చారిటబుల్ ట్రస్టు, విద్యాసంస్థల ఆధ్వర్యంలో చేయూతనందించారు. విద్యార్థులతో కలిసి ఏకశిల డీజీ స్కూల్ శివనగర్ బ్రాంచి డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి.. కాశిబుగ్గలోని మదర్ థెరిస్సా మిషనరీస్ నిర్మల్ హృదయ్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలు, వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేసి, ఆశ్రమానికి కుర్చీలు, 20 కిలోల గోధుమ పిండిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏకశిల స్కూల్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టర్నోవర్‌పై టాక్స్‌ను నిరసిస్తూ మార్కెట్ బంద్

వరంగల్: అడ్తిదారుల నుంచి వసూలు చేస్తున్న టర్నోవర్ టాక్స్‌ను రద్దు చేయాలని అడ్తి, కమీషన్, ఏజెంట్ల రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సంపూర్ణంగా బంద్ జరిగింది. ఈసందర్భంగా ఎలాంటి క్రయ, విక్రయాలు జరగలేదు.

సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షం

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబుతో కలిసి 11మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు అభినందనలు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ బండా ప్రకాశ్‌ను సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాంబయ్య, ప్రధాన సలహాదారులు కొమ్మినేని భూపాల్‌రావు, జిల్లా అధ్యక్షుడు దయ్యాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అనితారెడ్డికి సన్మానం

హన్మకొండ అర్బన్: వృద్ధులకు సేవలందిస్తున్న అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ కారుకాల అనితారెడ్డిని సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నగరంలోని ఆదర్శ లా కళాశాలలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బుర్ర విద్యాసాగర్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, దేవాచారి, రచయిత సిరాజుద్దీన్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా అనాథ, వృద్ధులు, దివ్యాంగుల కోసం అనేక సేవలందిస్తూ అనితారెడ్డి స్ఫూర్తిగా నిలిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

మడికొండ: సీఎం కేసీఆర్ నియంత తరహా పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఈక్రమంలో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. 64వ డివిజన్ మడికొండలో 88, 90, 93వ బూత్ స్థాయిలో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌ను డివిజన్ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ తాటిరెడ్డి రవీందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు కందూరు వెంకటేశ్వర్లు, వస్కుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గాబ్రియల్ విద్యార్థుల ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్: రుద్రమదేవి షొటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో కాజీపేట సెయింట్ గాబ్రియల్ విద్యార్థులు పతకాలు సాధించారని మాస్టర్ మంద విజేందర్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సహకారంతో సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19న నిర్వహించిన పోటీల్లో అండర్ -12 కేటగిరీలో గ్రూప్ ఏబీసీలో సింగిల్ కటాలో ఎస్.వైష్ణవి, కె.సాన్వీ, సుధామ భరద్వాజ్.. బంగారు పతకాలు సాధించగా, గ్రూప్ సీడీఈ లో స్పారింగ్‌లో సీహెచ్.హేమంత్, ఎం.శ్రీకర్, జీ.నివేదిత వెండి పతకాలు అందుకున్నారని, డీఈఎఫ్‌లో కె నందిత, కృషిత కాంస్య పతకాలు సాధించారని విజేందర్ వివరించారు.

జాబ్‌మేళాలో 69 మందికి ఉద్యోగాలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ (ఆఫ్ క్యాంపస్) ఆధ్వర్యంలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 69 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు కె.రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ యాదవ్ తెలిపారు. జాబ్‌మేళా పలు కళాశాల చెందిన 197మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు మధుకర్, వేణుగోపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్‌ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసత్యాలతో చరిత్రను నిర్మించలేరు

కాశిబుగ్గ: అబద్ధాలు, అసత్యాలతో చరిత్రను నిర్మించలేరని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల అన్నారు. ఏసీరెడ్డి రఘునాథ భవన్‌లో రెడ్‌బుక్ డేను పురస్కరించుకొని భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని గురువారం చదివి వినిపించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, రాధమ్మ, శిరీష, అరవింద్, భాస్కర్, సందీప్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'పండుగల సందడి' అజరామరం

కాజీపేట రూరల్: పండుగల సందడి అనే పద్య పుస్తకం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, పండుగల విశిష్టతను పద్య కావ్యంలో రాయడం సముచితంగా ఉందని ప్రముఖ కవి డాక్టర్ వై.నాగయ్య కొనియాడారు. డీజిల్‌కాలనీ సమీపంలోని సెయింట్ ఫ్రాన్సిస్ అక్షర హైస్కూల్‌లో విశ్వకళ భారతి సాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కవి, కార్టునిస్టు కాయిత సారంగపాణి రచించిన పండుగల సందడి అనే పద్య పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు.

అబ్బనికుంటలో కంటి వెలుగు కేంద్రం

కాశిబుగ్గ: 18వ డివిజన్ అబ్బనికుంట ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కుందారపు రాజేందర్, ఎండి.యాసిన్, జి.రాజేష్, క్యాంప్ వైద్యాధికారి అర్చన, డాక్టర్ జ్యోతి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు

కాజీపేట: కాజీపేటలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో దేవి సప్తశతి చండీ పారాయణాన్ని గురువారం జరిపించారు. నవగ్రహ జపాలు, వేద పారాయణం, రుద్ర నమక చమకాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు వేడుకలను తిలకించారు.

ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ శ్రమదానం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ శివారులోని వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం శ్రమదానం చేశారు. ట్యాంక్‌బండ్‌పై నడవడానికి ఇబ్బందిగా ఉందని గుర్తించిన సభ్యులు.. ప్రధాన కార్యదర్శి బి.రాజేశ్వర్ ఆధ్వర్యంలో కలిసి పిచ్చి మొక్కలు, సర్కారు తుమ్మలను తొలగించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ, హర్భజన్ సింగ్, రాజ్‌కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ప్రకటించాలి

హన్మకొండ అర్బన్: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్ ప్రకటించాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు సూచించారు. ఈమేరకు నగరంలోని సర్క్యూట్ హౌజ్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు.

కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

వరంగల్ చౌరస్తా: వరంగల్ పోచమ్మమైదాన్‌లో ఏళ్లగా అర్థంతరంగా నిలిచిపోయిన కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డాడీ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని బాపూజీహాల్‌లో కళా సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కాంప్లెక్స్ పనులను మొదలు పెట్టేందుకు కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ముందుకు రావాలని కోరారు. నిర్మాణ పనులు చేపట్టకపోతే కళాకారుల నుంచి నిరసన వ్యక్తమవుతుందని హెచ్చరించారు. సమావేశంలో డీపీఆర్‌ఓ కళాకారుల సంఘం అధ్యక్షుడు సింగారపు జనార్దన్, కార్యదర్శి నామోజు వెంకటాద్రి, గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల పరిశీలన



పండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలో సుమారు రూ.27కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రణాళికను వ్యాపారులతో కలిసి ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, సునీల్‌కుమార్, పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెల్డి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.